క్లుప్తంగా

ధృతి ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు



రోగి బంధువుకు ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కిరణ్మయి

బోట్‌క్లబ్: వైద్య సేవలు సకాలంలో అందించడం ద్వారా రోగులను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించాలన్న తపనతో ధృతి ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు బ్లూరైన్ హాస్పిటల్, చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.శుభశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇనోదయా హాస్పిటల్‌లో హృద్రోగ విభాగంలో చికిత్స పొందుతున్న రోగి బంధువుకు రూ. 18,500 చెక్కును బ్లూరైన్ హాస్పిటల్‌లో శనివారం అందించారు. నవజాతి శిశువులను రక్షించాలన్న ప్రధాన ఆశయంతో ధృతి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తల్లులకు తమ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆడ శిశువులపై తల్లితండ్రులు చూపిస్తున్న ఉదాసీనతను గమనించడం ద్వారా వారికి మనోధైర్యాన్ని కల్పించడమే కాక ఆర్థిక సహాయం కల్పిస్తున్నామన్నారు. ట్రస్ట్ సేవలు కోసం ధృతి ఫౌండేషన్ డాట్ కామ్‌లో గానీ 95774 03999 నెంబర్‌లో కానీ సంప్రదించవచ్చునన్నారు.

జాతీయ భావాన్ని పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీనగేష్

కాకినాడ రూరల్: కులమతాలకు అతీతంగా అందరూ జాతీయ భావాన్ని పెంచుకోవాలని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారత జాతీయ పతాక రూపకల్పన దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిషత్ 1947లో మువ్వన్నెల జెండాను జాతీయ జెండాగా జూలై 22న ఆమోదించడంతో జాతీయ పతాక అవతరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, చంద్రరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పేర్రాజు



శ్రీనివాస్ నుంచి ధ్రువపత్రం తీసుకుంటున్న పేర్రాజు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడ రూరల్ మండలానికి చెందిన దినవహి పేర్రాజు (బాబు) బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో ఎండీ ఎస్.శ్రీనివాస్ నుంచి ప్రభుత్వం ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఈ నెల 28వ తేదీన జరగబోయే బోర్డు సమావేశానికి రావలసిందిగా సూచించారు. ఆయనతో పాటు సీఈవో జి.నాగసాయి, భావ నారాయణస్వామి ఆలయ మాజీ పాలకవర్గ సభ్యుడు ప్రసాద్, బ్రాహ్మణ సంఘ ప్రతినిధి బీవీఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు. కార్పొరేషన్‌కు అనుబంధంగా ఉన్న క్రెడిట్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని దినవహి పేర్రాజు తెలిపారు. త్వరలో కాకినాడ రూరల్ బ్రాహ్మణ భవనం సొసైటీ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

మత్స్య సహాయకులకు అర్హత కల్పించాలి



మంత్రి సీదిరికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదోన్నతుల ప్యానల్‌లో 2019 ఎమెండ్‌మెంట్స్ ప్రకారం మత్స్య సహాయకులకు అర్హత కల్పించాలని జిల్లా మత్స్యకారుల సంఘం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు చాగంటి పరశురామ్ ఆధ్వర్యంలో కాకినాడ ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సంఘ సభ్యులు కోరగా మంత్రి సీదిరి అప్పలరాజు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సభ్యులు ఏవీవీ సత్యనారాయణ, గాయత్రి, నాగశ్రీ, బ్రహ్మానందగౌడ్, సూరిబాబు, నవీన్, సురేష్‌లు ఉన్నారు.

అన్నదాతకు అభయం ఆర్బీకేలు

- తొలకరి వేళ అందరికీ అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- రైతులకు ఉపకరిస్తున్న ప్రభుత్వ విధానాలు



నారు మడి తయారీలో రైతు



గంగనాపల్లిలో రైతున్నల ఆధునిక దేవాలయంగా ఆర్బీకే

కాకినాడ రూరల్: తొలకరి చినుకుల సవ్వడిలో సాగుబడి కోసం సిద్ధమవుతున్న రైతన్నలకు అవసమయ్యే విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. ఖరీఫ్‌లో రైతులు అత్యధికంగా సాగు చేసే వరికి అవసమరయ్యే విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలతో పాటు లైసెన్స్ కలిగిన ఎరువులు, విత్తనాల దుకాణాల్లో సిద్ధంగా ఉంచారు. రైతు బాగుంటే దేశం బాగుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగుబడిలో రైతులు ఏ విధంగా ఇబ్బందులు పడకూడదని, వారి సేవల్లో తరించేలా అవసరమైన మెళకవలు, సూచనలు అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్బీకేలు అందుబాటులోకి తీసుకువచ్చారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు గ్రామ స్థాయిలో ఆర్‌బీకేలలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు నిత్యం రైతుల సేవలో తరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు నారు మళ్ల కోసం దుక్కులు చేపడుతున్నారు. కొందరు రైతులు నేరుగా వెదజల్లు ద్వారా సాగుకు సన్నద్ధమవుతున్నారు. కాకినాడ రూరల్ మండలంలో సుమారు రూ.5వేల ఎకరాలలో ఈ సీజన్‌లో వరి సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులతో పాటు కౌలు రైతులు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనోపాధి పొందుతుండంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కౌలు రైతు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) లక్ష్యం మేరకు 925 మందికి అందజేశారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 7029 (స్వర్ణ), సంపద స్వర్ణతో పాటు బీపీటీ 5204, ఎంటీయూ 1318 వంటి వరి వంగడాల సాగు కోసం మొగ్గు చూపుతుండడంతో ఆర్బీకేల్లో 100 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచారు. అలాగే యూరియా 170 మెట్రిక్ టన్నులు, డీఏపీ 45 మెట్రిక్ టన్నులు, పొటాష్ 5 మెట్రిక్ టన్నులు తొలి విడతగా అందుబాటులో ఉంచారు. రైతుల డిమాండ్‌ను బట్టి ఇండెంట్ ప్రకారం నిల్వలు పెంచుకోనున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులు తమకు కావల్సిన సేవలు సద్వినియోగం చేసుకోవాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాం. రైతులు నారు మడి వేసే ముందు విత్తన శుద్ధి చేయడంతో తెగుళ్లకు దూరంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చు.

– సత్యనారాయణ, వ్యవసాయాధికారి, కాకినాడ రూరల్

ఆర్బీకేలతో నిశ్చింత



విత్తనం నుంచి పండించిన గింజ విక్రయం వరకు అన్ని విధాలుగా రైతులకు ఆర్బీకేలు అండగా ఉండడంతో నిశ్చింతగా ఉంది. సాగులో ఏ సందేహం వచ్చినా మండల కేంద్రానికి పోకుండా గ్రామంలోనే ఆర్‌బీకే ద్వారా నివృత్తి చేసుకుంటున్నాం. మా కోసం రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– చింతపల్లి దుర్గాప్రసాద్, రైతు, పండూరు

పక్కాగా ఓటర్ల సర్వే : ఆర్డీవో



ఓటర్ల సర్వేపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఇంటింటా ఓటర్ల సర్వే నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులు రోజువారీ లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా పరిశీలనపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేలో భాగంగా ప్రారంభమైన రెండు రోజుల్లో 6,660 ఇళ్లను సందర్శించడమైందని, తద్వారా 21,807 మంది ఓటర్లను గుర్తించడమైందన్నారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ మురార్జీ, కరప తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి వరహాలయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైనులు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉన్నాం ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చీడిగలో గడప గడపకూ



చీడిగలో ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: అండగా ఉన్నాం ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చీడిగ గ్రామస్తులను కోరారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాలు–1, 2 పరిధిలోని శనివారం సాయంత్రం ఆదర్శనగర్, రెవెన్యూకాలనీ, శ్మశానం రోడ్డు, శ్రీ శక్తి ఆలయం వీధి, బృందావనం కాలనీ, 1, 2 సినిహాలు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిని తెలియజేశారు. పార్టీ కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు కొప్పిశెట్టి గణేష్, దూనబోయిన అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరగాలి

- మొండి బకాయిలు రాబట్టాలి
- జయలక్ష్మి చైర్మన్ త్రినాథరావు



బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బందితో సమీక్షిస్తున్న చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు, కార్యవర్గ సభ్యులు

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ బాధితులకు న్యాయం జరిగేలా మొండిబకాయిలు రాబట్టాలని బ్రాంచ్ మేనేజర్లను చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు కోరారు. సర్పవరం జంక్షన్‌లో జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్‌లో శనివారం బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, కార్యవర్గ సభ్యులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొండి బకాయిలకు సంబంధించి ఆస్తుల జప్తునకు కోర్టు నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఈలోగా బకాయిలు వసూళ్లను వేగవంతం చేయాలని, బాధితులకు సత్వరన్యాయం జరిగేలా ఇప్పటి వరకు వసూలైన సొమ్ములను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వలంటీర్లకు వందనం

సేవలతో సంతృప్తి



నగరపాలక సంస్థ పరిధిలోని 46వ డివిజన్‌లోని కొండయ్యపాలేనికి చెందిన దివ్యాంగురాలు కర్రి సత్యవతికి వార్డు వలంటీర్ ఎ.దైవకృప వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు. ఇంటి పట్టాకు దరఖాస్తు చేయించి, దానిని కూడా అందజేశారు. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారక ముందే వలంటీర్ పింఛను అందజేస్తున్నారు. ప్రతినెల రేషన్ సరుకులు దగ్గర ఉండి ఇప్పించి ఇంటికి అందజేస్తున్నారు. వలంటీర్ ఎ.దైవకృప అందజేస్తున్న సేవలకు కుటుంబం ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొండయ్యపాలెంలో వికలాంగురాలు కర్రి సత్యవతికి పింఛను అందజేస్తున్న వలంటీర్ దైవకృప

వలంటీర్ సేవలతో ఆనందం

వాకాడ వలంటీర్ కనికెళ్ల చంద్రకుమార్ తనకు కేటాయించిన 50 కుటుంబాలను కలుస్తూ ప్రభుత్వ పథకాలు, సచివాలయం సేవలు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తనపరిధిలో మాతా కమలకు ఇంటిస్థలం వచ్చేలా చేశారు. కొద్దిపాటి పొలం ఉంటే వారికి రైతు భరోసా వచ్చేలా చేశారు. తుపాన్లకు పంట నష్టం జరిగితే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ విద్యాదీవెన, విద్యా వసతి పథకాలు వచ్చేలా చేశారు. చంద్రకుమార్ అందిస్తున్న సేవలకు ఆయా కుటుంబాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వాకాడలో లబ్ధిదారునికి ఇంటిస్థలం పట్టా ఇస్తున్న వలంటీర్ చంద్రకుమార్

ఇంటి స్థలం ఇప్పించారు



సొంతిల్లు లేక అవస్థలు పడుతుంటే వలంటీర్ చంద్రకుమార్ ఇంటి స్థలం రాయించి, పట్టా వచ్చేలా చేశారు. విద్యా దీవెన, విద్యా వసతి వచ్చేలా చేయడంతో మా అమ్మాయి అనిత ఇంజినీరింగ్ చదువుతోంది. మాకు కొద్దిపాటి పొలం ఉంటే రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రాయించి ఆర్థికసాయం అందేలా చేశారు. మా కుటుంబానికి చేదోడు, వాదోడుగా ఉంటూ వలంటీర్ చేస్తున్న సేవలు ఎప్పటికీ గుర్తించుకుంటాం. – మాతా కమల, వాకాడ

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్ర పూజలు



విశేష అలంకరణతో భావనారాయణ స్వామి ఆలయంలోని గోదా అమ్మవారు

బోట్‌క్లబ్: ఆండాళ్ (గోదా అమ్మవారు) తిరునక్షత్రం సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేష కుంకుమార్చన, విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు కనుమూరి బాలకిరణ్, సమీర దంపతులు రూ. 1.5 లక్షలు విలువైన కేజీన్నర వెండి మకరతోరణం ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరికి అందించారు. మకర తోరణానికి సంప్రోక్షణ నిర్వహించి అనంతరం అలంకరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ ఆలయంలోని గోదాదేవి

గోదాదేవికి తిరునక్షత్ర పూజలు

కాకినాడ రూరల్: మండలంలోని ప్రసిద్ధ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మ వారికి తిరు నక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించి అనంతరం విశేషంగా నూతన వస్త్రాలంకరణ, విశేష పుష్పాలంకణ చేశారు. కుంకుమార్చన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లోక్ అదాలత్‌లో 27 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు కమలాదేవి, నిఖిత

కాకినాడ లీగల్: లోక్ అదాలత్ ద్వారా 27 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. కాకినాడలో శనివారం మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. 26 బీమా (యాక్సిడెంట్) కేసుల ద్వారా బాధితులకు రూ.1.31 కోట్ల నష్ట పరిహారం ద్వారా పరిష్కరించారు. మరో భూ సంబంధ కేసులో రూ.8,90,777 పరిష్కారించారు. ఈ లోక్ అదాలత్ బెంచ్‌లకు ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీ నిఖిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎస్ పద్మజ న్యాయమూర్తులుగా వ్యవహరించారు.

గల్లంతైన బాలుడి కోసం ముమ్మర గాలింపు

కాకినాడ రూరల్: వాకలపూడి శిల్పారామం వెనక సముద్రంలో గల్లంతైన బాలుడు లాంజిపల్లి కృష్ణ ఆచూకీ కోసం ఇంకా గాలిస్తూనే ఉన్నారు. కరప గ్రామానికి ఆ బాలుడు ఈనెల 18న సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. శిల్పారామం వెనక బోటు ఎక్కడంతో కృష్ణ కంగారు పడి సముద్రంలో పడిపోయి గల్లంతయ్యాడు. బాలుడి తల్లిదండ్రులు వరలక్ష్మి, వెంకటేష్, తమ్ముడు రమణ, కుటుంబ సభ్యులు చేయని ప్రయత్నం లేదు. తుని నుంచి మొదలుకొని తాళ్లరేవు వరకు సముద్రపు ఒడ్డును గాలించడంతో పాటు హోప్ ఐలాండ్‌కు వెళ్లి గాలించారు. ఆయినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయమే వరలక్ష్మి, వెంకటేష్, ఇతర కుటుంబ సభ్యులు సుమారు పది మంది వాకలపూడి, సూర్యారావుపేట, ఉప్పాడ, పోర్టు వెనక ప్రాంతంలో గాలించారు. తమ బిడ్డ బతికి ఉండాలని వారు వేయి దేవుళ్లను వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా గల్లంతైన బాలుడి కేసు బాధ్యత తీసుకున్న సర్పవరం హెచ్‌సీ రామచంద్రరావు వారితో పాటు గాలిస్తూ ధైర్యం చెప్తున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేనందున గాలి తీవ్రతకు సముద్రం లోపలి భాగంలోకి వెళ్లి ఉండవచ్చని మత్స్యకారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. పోర్టు అధికారుల సహకారం తీసుకుంటున్నామన్నారు.



కృష్ణ ఆచూకీ కోసం సూర్యారావుపేట బీచ్ వద్దకు వచ్చిన తల్లి వరలక్ష్మి, కుటుంబ సభ్యులు

ఘనంగా 'వరల్డ్ బ్రెయిన్ డే'

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో వరల్డ్ బ్రెయిన్ డేను శనివారం నిర్వహించారు. రంగరాయ వైద్య కళాశాల న్యూరాలజీ, న్యూరో సర్జరీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎం షరీఫ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కే.బాబ్జి ముఖ్య అతిథిగా హాజరై మూర్ఛ, స్ట్రోక్ మెదడు ఆరోగ్యాన్ని తీవ్ర ప్రభావితం చేస్తాయని తెలిపారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, న్యూరాలజీ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ హరి విజయకుమార్, న్యూరో సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గిరి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన వైద్య విధానాలపై అవగాహన

జీజీహెచ్‌లోని రంగరాయ వైద్య కళాశాల అనుబంధ శస్త్రచికిత్స విభాగంలో 46వ రాష్ట్రస్థాయి శస్త్రచికిత్స నిపుణుల సమావేశం రెండో రోజు విజ్ఞాన భరితంగా సాగింది. అసోసియేషన్ ఆఫ్ జనరల్ సర్జన్స్ ఆంధ్రప్రదేశ్ విభాగం, రంగరాయ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. వక్తలు అందుబాటులోకి వచ్చిన అధునాతన శస్త్రచికిత్సా విధానాలపై చర్చించారు. సమావేశంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జీ, డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, పూర్వపు సూపరింటెండెంట్‌లు డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ బుద్ధా, సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రవికమల్, సమావేశ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నరేష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల హెచ్‌వోడీలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఏవోగా దేవకుమారి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఏవోగా గుడ్ల దేవకుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందిన దేవకుమారి కాకినాడ జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రస్తుత ఇన్‌చార్జి ఏవో సూర్యచంద్ర తిరిగి తన యథాస్థానంలో డిప్యూటీ డెమోగా కొనసాగనున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



జి.భావారం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ గణేష్

కరప: మండలం జి.భావారంలోని మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను సర్పంచ్ రొక్కాల గణేష్ విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు కె.చినబాబు, పీవీవీ రమణ, గ్రామస్తులు రొక్కాల తారకేష్, పెంటపాటి ప్రసాద్, బూసి మాణిక్యకుమార్, రొక్కాల లోకేష్, బొమ్మతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి రూ.3,08,957 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఈఓ తెలిపారు.



పూజలందుకుంటున్న తిరుపతి శంగారవల్లభ స్వామి

మొక్కలు ప్రకృతిలో భాగం

- ట్రాఫిక్ ఎస్ఐ ఏసుబాబు
- నారాయణ ఇ–టెక్నోలో ఘనంగా వనమహోత్సవం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మొక్కలు ప్రకృతిలో భాగమని, వాటిని పెంచడం విద్యార్థి దినచర్యలో భాగం చేసుకోవాలని ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు అన్నారు. శనివారం స్థానిక రామారావు పేట నారాయణ ఇ–టెక్నో స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసుబాబు మొక్కల విశిష్టతను వివరించి, మొక్కలు నరకకూడదని, ప్రతి విద్యార్థీ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని తెలిపారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ షర్మిల మాట్లాడుతూ వన మహోత్సవం ద్వారా విద్యార్థుల్లో మొక్కల అవశ్యకతపై అవగాహన కల్పించి, విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులు రామారావు పేట నారాయణ స్కూల్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు, ప్రిన్సిపాల్ షర్మిల జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు ప్రకృతి సంరక్షణ, పర్యావరణానికి సంబంధించిన నినాదాలుచేసి వాహన చోదకులకు, పాదచారులకు మొక్కలు ఉచితంగా పంచిపెట్టారు. పాఠశాల హైస్కూల్ జోనల్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి, సాఫ్ట్‌స్కిల్స్ ట్రెయినర్ పద్మలత, అకడమిక్ డీన్ రమణారెడ్డి, డీఎస్పీ కార్యాలయ హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు, పీఈటీలు విజయ్, కావ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఐ ఏసుబాబుకు మొక్కలు అందిస్తున్న విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిపాల్ షర్మిల

సురక్ష ధ్రువపత్రాల పంపిణీ



వాకలపూడిలో వలంటీర్లను సన్మానిస్తున్న కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి సచివాలయం–3, వలసపాకల–1 పరిధిలో శనివారం జగనన్న సురక్ష నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని వాకలపూడిలో 252మందికి, వలసపాకలలో 177మందికి సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. వాకలపూడిలో పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వలంటీర్ల సేవలను కురసాల అభినందించారు. అనంతరం సచివాలయ పరిధిలోని వలంటీర్లను ఆయన సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్ల శ్రీను, రాణి, కడియాల రాజు, కరీం బాషా, చక్రీ, వైఎస్సార్ రాజు, గొల్లపల్లి జగన్, సుబ్బారావు, ఇసుకపట్ల కుమారి తదితరులు పాల్గొన్నారు. వలసపాకల గ్రామంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి బీబీ తదితరులు పాల్గొన్నారు.

వాకాడలో..

కరప: మండలంలోని వాకాడలో శనివారం జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొని మాట్లాడుతూ ఎంతో కాలంగా కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కాలేదని, ఇప్పుడు గ్రామంలోని 35 మందికి సర్టిఫికెట్లు ఇస్తున్నామని, దీంతో వారికి ప్రత్యేక రేషన్‌కార్డులు ఇస్తున్నామని తెలిపారు. 234 మందికి ఆయన పలు ధ్రువపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వాకాడలో కౌలురైతుకు గుర్తింపు కార్డు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు